సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 30 । జూలై । 2024



అర్జీలు పునరావృతం కావొద్దు

అర్జీలు పునరావృతం కాకుండా, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. 8లో



బాల్యం నుంచే భక్తి పెరగాలి

పిల్లలకు చిన్నప్పటి నుంచే భక్తిభావాలు పెంచాలని మహా సహస్రావధాని గరికిపాటి నరసింహారావు అన్నారు. 8లో



కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు విమర్శించారు. 8లో

న్యూస్‌రీల్

సెల్ఫీ ఫర్ భారత్



చీర్ ఫర్ భారత్ సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఇండియా క్రీడాకారులు విజయకేతనం ఎగురవేసి, అధిక పతకాలు సాధించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆకాంక్షించారు. ఒలింపిక్ క్రీడాకారులకు మద్దతుగా, ఒలింపిక్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీర్ ఫర్ భారత్ పేరుతో కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీపాయింట్‌ను ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రీడల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ఒలింపిక్స్ క్రీడలపై క్విజ్, సెమినార్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు, క్రీడా కిట్లను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా సంస్థ అధికారి ఎల్.వి.రమణ, శిక్షకులు పాల్గొన్నారు.

తాండవకు జలకళ



కొత్త నీటితో తాండవ రిజర్వాయర్

నాతవరం: తాండవ రిజర్వాయర్‌లో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. నెల రోజుల కిందట తాండవ ప్రాజెక్టులో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందారు. ఇటీవల ప్రకృతి కరుణించి అధిక వర్షాలు పడడంతో నెల రోజుల వ్యవధిలో 10 అడుగుల నీటి మట్టం పెరిగింది. జూన్ 28న 351.0 అడుగుల నీటి మట్టం ఉండగా ఆదివారం సాయంత్రానికి 371.5 అడుగులకు పెరిగింది. ఎగువ ప్రాంతం నుంచి ప్రతి రోజూ ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులకు పైగా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. దీంతో ఇంకా నీటి మట్టం పెరిగే అవకాశం ఉందని తాండవ ప్రాజెక్టు జేఈ రామకృష్ణ తెలిపారు. రెండు రోజుల కిందట తాండవ ప్రాజెక్టు అధికారులు రైతు సంఘాల, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి, వచ్చేనెల ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నట్టు చెప్పారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు



ఖైదీలతో మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు

నర్సీపట్నం: ఖైదీలు ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు తెలిపారు. స్థానిక సబ్ జైల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైల్‌లో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. బెయిల్ పెట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేని ఖైదీలు మండల న్యాయసేవాధికారి సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చని సూచించారు. అటువంటి వారు ఉంటే వివరాలు ఇస్తే న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. న్యాయవాదులు పి.నాగేశ్వరరావు, గోవింద, కృష్ణ గంగారాజు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే ప్రమాదాలకు కారణం

- జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్

అనకాపల్లి: రహ దారి భద్రతపై సుప్రీంకోర్టు కమి టీ నివేదిక ప్రకా రం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే రహదారి ప్రమాదాలకు ప్రధాన కారణమని జిల్లా రవాణాశాఖ అధికారి మనోహర్ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృతంగా వాహన తనఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2019 సెంట్రల్ మోటారు వాహన చట్టంలో సవరణల ప్రకారం ఉల్లంఘనలకు జరిమానాతోపాటు 3 నెలలు లైసెన్స్ సస్పెండ్ చేయనున్నట్లు హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.5 వేలు, వాహన బీమా లేకపోతే రూ.2 వేలు జరిమానాలు విధిస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడపటం వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాంటి సందర్భాల్లో రూ.25 వేలు జరిమానా, వాహన యజమానికి మూడేళ్ల జైలు శిక్ష తప్పదన్నారు. ఏడాది పాటు నిరంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గెడ్డలో గిరిజనుల నిరసన



అజయ్‌పురం గెడ్డలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, గిరిజనులు

మాడుగుల: జలదిగ్బంధంలో చిక్కుకున్న మండలంలోని తాటిపర్తి పంచాయతీ అజయ్‌పురం గిరిజనులు, సీపీఎం నాయకులతో కలిసి సోమవారం స్థానిక గెడ్డలోకి దిగి నిరసన తెలిపారు. రెండు వారాలుగా కురుస్తున్న వర్షాలకు అజయ్‌పురం గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో విద్య, వైద్యం తదితర కనీస సౌకర్యాలకు దూరమైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో పాల్గొన్న సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కార్లి భవాని మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే స్పందించి జలదిగ్బంధంలో చిక్కుకున్న గిరిజనులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గెడ్డపై వంతెన నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. నిరసనలో స్థానిక గిరిజనులు వంతాల కేశవరావు, మచిరాజు, పోతురాజు, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కంచాలతో ఆందోళన



ఖాళీ కంచాలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు

దేవరాపల్లి: ఉపాధి హామీ పథకం బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వేతనదారులు వినూత్నంగా దేవరాపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ఖాళీ కంచాలు, గ్లాసులు చేత పట్టి ఆందోళన చేశారు. తిండి పెట్టండి లేదా బకాయిలు చెల్లించండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. ఉపాధి కూలీల ఆందోళనకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, జిల్లా నాయకుడు బి.టి.దొర మద్దతు ప్రకటించి, మాట్లాడుతూ జిల్లాలో సుమారు రూ. 50 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. బకాయిలను తక్షణమే చెల్లించాలని లేకుంటే జిల్లా ఉపాధి హామీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, కె.రాము, పి.దుర్గా, బి.సూర్యనారాయణ, పి.దేముడు, సోముల సింహాచలం, పి.శ్రీరామ్ తదితర ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి 'కల్ప' వృక్షం

- జిల్లాలో 20 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు
- పీచు, పొట్టు ఎగుమతులతో అధికలాభాలు
- వలు రకాల ఉత్పత్తుల తయారీలో వినియోగం
- 34 పీచు పరిశ్రమల్లో వందలాది మందికి ఉపాధి
- పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో అధికంగా పరిశ్రమలు

కొబ్బరి.. అనగానే మన రాష్ట్రంలో కోనసీమే గుర్తుకొస్తుంది. ఎత్తున పెరిగే కొబ్బరి చెట్ల వల్లే ఆ ప్రాంతానికి సరికొత్త అందం వచ్చింది. ఆ సీమ అందాలు మన జిల్లాలో కూడా కనిపిస్తున్నాయి. కొబ్బరి సాగుతో పుష్కలమైన ఆదాయమూ సమకూరుతోంది. ఇక్కడి రైతులు, వ్యాపారులను లాభాల బాట పట్టిస్తోంది. వందలాది మందికి ఉపాధి కల్పిస్తోంది. తొక్కే కదా అని తీసిపారేస్తున్న పీచును, దాని నుంచి వచ్చిన పొట్టును చైనాకు ఎగుమతి చేస్తూ అధిక లాభాలను గడిస్తున్నారు.



కొరుప్రోలు గ్రామంలో కొబ్బరి పీచు పరిశ్రమ

సాక్షి, అనకాపల్లి: దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు ఎక్కువగా వినియోగిస్తున్న కొబ్బరి ఇప్పుడు జిల్లా ప్రజల పాలిట వరప్రసాదంగా మారింది. మూడు మండలాలకు ఉపాధి 'కల్ప'వృక్షమైంది. రైతులు, వ్యాపారులకు లాభాలు తెచ్చిపెట్టడడంతో పాటు పలువురికి చేతి నిండా పని కల్పిస్తోంది. కొబ్బరి కాయలో కొబ్బరితో పాటు పీచు, దాని నుంచి వచ్చే పొట్టుకు కూడా భారీ డిమాండ్ ఉంది.

పీచు, పొట్టుకు డిమాండ్

తొక్కే కదా అని తీసిపారేస్తే నష్టపోవలసిందే. **కొబ్బరి కాయతోపాటు పీచు, పొట్టుకు అధిక డిమాండ్ ఉంది. కొబ్బరి పీచును సోఫాసెట్లు, కార్పెట్లు, పరుపులు, తాళ్లు, బొమ్మల తయారీలో వినియోగిస్తున్నారు. పొట్టును ఇటుకలు, సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగిస్తున్నారు. ఇలాంటి కొబ్బరి పీచు పరిశ్రమలు జిల్లాలో యలమంచిలి, ఎస్.రాయవరం, రాంబిల్లి మండలాల్లో ఎక్కువగా ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు ఆదనపు** ఆదాయం రావడంతోపాటు, స్థానిక మహిళలకు ఉపాధి లభిస్తోంది.

అనకాపల్లి టు చైనా...

జిల్లా నుంచి చైనాతో పాటు మన దేశంలో చెన్నై, గుజరాత్, కోల్‌కత్తా తదితర రాష్ట్రాలకు పీచును ఎగుమతి చేస్తున్నారు. జిల్లా నుంచి చెన్నై, విశాఖలోని చైనా దేశం ఏజెంట్ల ద్వారా పోర్టు నుంచి ఎగుమతి చేస్తున్నారు.

ఒక్కో కొబ్బరి కాయ నుంచి 80 గ్రాముల పీచు

జిల్లాలో చిన్నాపెద్ద కలిపి 34 కొబ్బరి పీచు పరిశ్రమలు ఉన్నాయి. సగటున 350 గ్రాముల బరువు ఉన్న ఎండు కొబ్బరి కాయ నుంచి 80 గ్రాములు పీచు వస్తే.. కొబ్బరి పొట్టు 160 గ్రాముల వరకు వస్తోంది. ఏడాదికి వేల టన్నుల పొట్టు ఉత్పత్తి అవుతోందని అంచనా. అధిక ఈసీ ఉన్న కొబ్బరి పొట్టును నేరుగా వినియోగిస్తే మొక్కలు దెబ్బతింటాయి. దీంతో వివిధ పద్ధతులలో ఈసీ శాతం తగ్గించి కంపోస్టుగాను, బ్రిక్స్ రూపంలో తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు. ఈసీ ఎక్కువగా ఉన్న పొట్టును ఇటుక బట్టీలకు టన్ను రూ.2,500 చొప్పున విక్రయిస్తుండగా.. తక్కువ ఈసీ ఉన్న పొట్టును టన్ను రూ.5 వేలకు విక్రయించి లాభాలనార్జిస్తున్నారు. కొబ్బరి పొట్టుతో నాణ్యమైన సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చు. దాని ధర పొట్టు రూపంలో టన్ను రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంది.

జిల్లాలో వివరాలు ఇలా..



- జిల్లా వ్యాప్తంగా 34 పరిశ్రమలు
- ప్రధానంగా ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, యలమంచిలిలలో ఫ్యాక్టరీలు
- ఏడాదికి 6 వేల టన్నుల పీచు తయారీ
- కొబ్బరి పీచుతో తాళ్లు, నార, మ్యాట్‌ల తయారీ
- సుమారుగా 3,000 మందికి ఉపాధి

15 వేల ఎకరాల్లో సాగు..



జిల్లాలో ఎస్.రాయవరం, యలమంచిలి, రాంబిల్లి మండలాల్లో కొబ్బరి ఎక్కువగా సాగవుతోంది. జిల్లా మొత్తం మీద సుమారు 20 వేల ఎకరాల్లో కొబ్బరిని సాగు చేస్తున్నారు. ఇక్కడ కొబ్బరి పీచు పరిశ్రమల ద్వారా ఏటా లక్షలాది రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయి. నెలకు 10 టన్నుల పీచు, తాళ్లు ఉత్పత్తి చేస్తూ 3 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. పీచు పరిశ్రమలకు అవసరమైన కొబ్బరి డొప్పలను స్థానికంగా కొబ్బరి రైతులు, వ్యాపారుల నుంచి పరిశ్రమల నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. ట్రాక్టర్ లోడుకు రూ.4వేల నుంచి, రూ.5 వేలు వరకు, లారీ కొబ్బరి డొక్కులకు రూ.7వేల నుంచి రూ.8 వేల వరకు చెల్లించి కొనుగోలు చేస్తారు. కొబ్బరి పీచు తయారీకి కిలోకు రూ.8 వరకు ఖర్చవుతుంది. పరిశ్రమ ద్వారా పీచు ఉత్పత్తి చేయగా మిగిలిన పొట్టును ఇటుకల బట్టీలకు విక్రయిస్తుంటారు. పరిశ్రమ వద్దకు తెచ్చిన డొక్కను పీచుగా మార్చడానికి కనీసం నెల రోజుల వ్యవధి పడుతుంది. కొబ్బరి పీచు ఉత్పత్తులను విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. స్థానికంగా కూడా సోఫాసెట్లు, కార్పెట్లు, పరుపులు, తాళ్ల వినియోగం పెరగడంతో 30 శాతం ఉత్పత్తులను ఇక్కడే ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం కొబ్బరి దిగుబడులు తగ్గడంతో కిలో పీచు ధర రూ.8 మాత్రమే ఉందని రైతులు తెలిపారు. ఎగుమతులు కూడా సరిగా లేకపోవడంతో పరిశ్రమల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదాయంగా అందిస్తున్న కొబ్బరి పీచు తయారీ పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహించాలని యజమానులతో పాటు కొబ్బరి రైతులు కోరుతున్నారు. ఉత్పత్తి అయిన కొబ్బరి పీచును చిన్న పరిశ్రమ నిర్వాహకులు నిల్వ చేసుకునేందుకు గోదాముల ఏర్పాటుకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని , రాయితీలు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు

పీచు తయారీ పరిశ్రమలకు రాయితీ కల్పించాలి..



వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న కొబ్బరి పీచు తయారీ పరిశ్రమలకు విద్యుత్ రాయితీ కల్పించాలి. జిల్లాలో మరిన్ని కొబ్బరి పీచు తయారీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. స్థానిక మహిళలకు ఉపాధి కలుగుతోంది.

– కోలా జగదీష్, యాజమాని, కొరుప్రోలు గ్రామం

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తాం..



రాంబిల్లిలో రాధా స్వామి ఫైబర్ కొబ్బరి పీచుతయారీ పరిశ్రమను 2022లో ప్రారంభించాను. 10 నుంచి 15 మందికి ఉపాధి కల్పిస్తున్నాను. రెండేళ్లగా ఆశించినంత లాభాలు లేవు. ప్రభుత్వం నుంచి టెక్నికల్ సపోర్టు కావాలి. కొత్త ఉత్పత్తులు తయారీ చేసేలా ప్రోత్సాహం కల్పించాలి. పరిశ్రమలకు విద్యుత్ సబ్సిడీ కల్పించాలి. ఇక్కడ పీచు తయారీ చేసి గుజరాత్, కోల్‌కత్తా వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నాం.

– రాధా సుందర సుబ్బరాజు(కిశోర్‌రాజు), పరిశ్రమ యజమాని, రాంబిల్లి

ఆ'స్థాయి'లో కలెక్షన్!

మహా విశాఖ నగర పాలక సంస్థ పరువును టీడీపీ బంగాళాఖాతంలో కలిపేసింది. జీవీఎంసీ చరిత్రలో తొలిసారిగా స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికల కోసం కార్పొరేటర్ల నుంచి పైసా వసూల్ కార్యక్రమానికి అధికార పార్టీ ఎమ్మెల్యేలు తెరతీశారు. కాసులిచ్చిన కార్పొరేటర్లకే నామినేషన్ పత్రాలందించారు. కాసుల కక్కుర్తి కోసం సొంత పార్టీ కార్పొరేటర్లకు జనసేన ఎమ్మెల్యేలు ఝలక్ ఇచ్చారు. కూటమి కలిసి వస్తోందంటూ బాహాటంగా ప్రకటించిన టీడీపీ.. నామినేషన్ వేసేందుకు సిద్ధమైన బీజేపీ మహిళా కార్పొరేటర్ నుంచి పేపర్లు తీసుకొని పంపించేసి అవమాన పరిచారు. గత మూడు పర్యాయాలు వైఎస్సార్‌సీపీ ఏమి ఆశించకుండా పదవులు కట్టబెట్టింది. కానీ అధికారంలోకి వచ్చిన వెంటే ఓ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'గణ'ంగా కలెక్షన్లు మొదలు పెట్టేశారు.

- పంతం నెగ్గించుకున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు
- కాసులిచ్చినవారికే స్టాండింగ్ కమిటీ సభ్యత్వం
- సొంతపార్టీ కార్పొరేటర్లకు ఝలక్ ఇచ్చిన జనసేన ఎమ్మెల్యేలు
- బీజేపీ కార్పొరేటర్ నుంచి నామినేషన్ పత్రాల్ని వెనక్కి తీసుకున్న వైనం
- కూటమిలో కుంపటి రేపిన స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

సాక్షి, విశాఖపట్నం : జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పైసల వసూలు కార్యక్రమానికి తెరతీసిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు అనుకున్న పంతాన్ని నెరవేర్చుకున్నారు. నాలుగు రోజులుగా జరుగుతున్న బేరసారాలు కొలిక్కి వచ్చాయి. టీడీపీకి చెందిన ఓ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఎవరికైతే స్టాండింగ్ కమిటీ సీటు కావాలో వారు కచ్చితంగా రూ.20 లక్షలు ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేయడంతో డబ్బులున్నవారంతా అంగీకరించి సీటు సాధించారు. పలువురు టీడీపీ కార్పొరేటర్లు తాము అంత డబ్బు ఇవ్వలేమనీ.. సీటు కావాలని కోరినా కనికరించలేదు. తమ పరిధిలో జరుగుతున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేలు జోక్యంపై వీరు తీవ్రంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మాకివ్వాల్సింది ఇవ్వండి.. గేట్లెత్తేసెయ్యండి..!

జీవీఎంసీలో జరగాల్సిన పనులకు సంబంధించిన అంశాల్ని స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదిస్తారు. గత మూడు పర్యాయాలు అంతా పారదర్శకంగా నిర్వహించారు. ఎవరి వద్ద ఒక్క రూపాయి తీసుకోకుండా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈసారి టీడీపీ ప్రజాప్రతినిధులు మాత్రం అవినీతికి గేట్లెత్తామంటూ చెప్పకనే చెప్పేశారు. మా వాటాలు మాకిచ్చెయ్యండి.. స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరిగాక.. గెలిస్తే 10 నుంచి 20 శాతం పర్సంటేజీలు కుదుర్చుకోండి. ప్రతి పనిలోనూ వాటాలు తీసుకొని.. ఇష్టం వచ్చినట్లుగా సంపాదించుకోండంటూ ఎమ్మెల్యేలు.. టీడీపీ కార్పొరేటర్లకు హితోపదేశం చేయడం విడ్డూరం. మాకు రూ.20 లక్షలివ్వండి.. ఏడాదిలోగా రూ.40 లక్షలకు పైగా సంపాదించుకోవచ్చు అంటూ బహిరంగంగానే ఆఫర్లు ఇవ్వడం మంచి సంస్కృతి కాదనీ టీడీపీ సీనియర్ కార్పొరేటర్లే ఖండించడం గమనార్హం.

జనసేన, బీజేపీకి ఝలక్.!

జీవీఎంసీ పరిధిలో ఇద్దరు జనసేన ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే ఉన్నారు. బీజేపీ ఎమ్మెల్యే ఈ ఎన్నికల్లో జోక్యం చేసుకోలేదు. ఒక జనసేన ఎమ్మెల్యే వేలం వ్యవహారంలో ప్రత్యక్షంగా పాల్గొని టీడీపీతో చేతులు కలిపేశారు. జనసేన కార్పొరేటర్లు ఉన్నా వారి వైపు కనీసం మాట్లాడకుండా.. డబ్బులిచ్చే టీడీపీ కార్పొరేటర్లకే తన మద్దతంటూ స్పష్టం చేశారు. దీంతో సొంత పార్టీ ఎమ్మెల్యేనే జనసేన కార్పొరేటర్లకు వెన్నుపోటు పొడవడం విశేషం. ఒక ఇండిపెండెంట్ కార్పొరేటర్‌కు మద్దతునిచ్చారే తప్ప.. సొంత పార్టీ వారితో కనీసం చర్చించలేదు. ఇటీవల జనసేన కండువా కప్పుకునేందుకు సిద్ధమైన ఓ మహిళా కార్పొరేటర్ డబ్బులిచ్చి పార్టీలో చేరాలా అంటూ ఎమ్మెల్యేని నిలదీశారు. బీజేపీకి చెందిన ఓ మహిళా కార్పొరేటర్ నామినేషన్ వేసేందుకు సిద్ధమై పత్రాల్ని తీసుకెళ్లారు. కూటమి ఎమ్మెల్యేలు ఆమెని పిలిపించి నామినేషన్ పత్రాలు తీసేసుకొని.. మీకెందుకమ్మా స్టాండింగ్ కమిటీ.. వెళ్లండి వెళ్లండంటూ విసుక్కున్నట్లు తెలుస్తోంది. దీంతో సదరు కార్పొరేటర్ అవమాన భారంతో కన్నీటి పర్యంతమవుతూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. ఈ వ్యవహారాలు చూస్తే పొరపాటున స్టాండింగ్ కమిటీలో టీడీపీ విజయం సాధిస్తే.. జీవీఎంసీ అవినీతిమయం అయిపోతుందని కూటమి కార్పొరేటర్లే వ్యాఖ్యానిస్తున్నారు. కచ్చితంగా తమ పార్టీ వాళ్లను క్రాస్ ఓటింగ్‌తో ఓడిస్తామంటూ కొందరు చర్చించుకుంటున్నారు.

టీడీపీ కార్పొరేటర్ల వాగ్వాదం

స్టాండింగ్ కమిటీ సీట్ల అమ్మకం వ్యవహారంతో సోమవారం మధ్యాహ్నం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద రచ్చ రచ్చ జరిగింది. డబ్బులిచ్చేవారికే టికెట్స్ ఎలా ఇస్తారంటూ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్‌తో కార్పొరేటర్లు సేనాపతి వసంత, ముక్కా శ్రావణి, బీజేపీకి చెందిన గంకల కవిత వాగ్వాదానికి దిగారు. ఒకరిపై ఒకరు కేకలు, అరుపులతో జీవీఎంసీ దద్దరిల్లింది. ఉద్యోగులు, సిబ్బంది ముందు కూటమి కార్పొరేటర్లు కేకలు, అరుపులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పార్టీకి చెందిన కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్, గంధం శ్రీనివాస్.. వారిని సర్ది చెబుతున్నా వినకపోవడంతో నగర అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, విష్ణుకుమార్‌రాజు వద్దకు పంచాయితీ చేరింది. వారు కార్పొరేటర్లకు సర్ది చెప్పారు.

నామినేషన్లకూ ఆహ్వానం లేదు!

మంగళవారంతో నామినేషన్ల స్వీకరణకు గడువు ముగుస్తుండటంతో సోమవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ నుంచి ఐదుగురు, టీడీపీ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థితో కలిపి 10 మంది కార్పొరేటర్లు నామినేషన్లు వేశారు. కూటమి నుంచి అనకాపల్లి, విశాఖ ఉత్తర మినహా మిగిలిన అన్ని చోట్ల నుంచి కార్పొరేటర్లు నామినేషన్లు వేశారు. అయితే నామినేషన్లు వేసే సమయంలో కూటమి పార్టీలకు చెందిన కార్పొరేటర్లెవ్వరికీ కనీసం ఆహ్వానించకపోవడంపైనా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సాయం



వై.బి.పట్నంలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాంబాబుకు వైద్యం కోసం వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆ చెక్కును మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ బాధితుడికి అందజేశారు. - 8లో

టెట్‌కు ఉచిత శిక్షణ

తుమ్మపాల: టెట్ పరీక్షకు హాజరయ్యే మైనార్టీ విద్యార్థుల కోసం మైనార్టీ సంక్షేమ శాఖ, ఏపీ ప్రభుత్వ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారిణి ఎం.సత్యపద్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఏయూ పీజీ సెంటర్‌లో ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 25 వరకు ఈ శిక్షణ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బుద్ధులు, జైనులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో 50 అర్జీలు



అర్జీదారుల సమస్యను వింటున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 50 అర్జీలు వచ్చాయి. ఎస్పీ ఎం.దీపిక తన కార్యాలయంలో రిసెప్షన్‌లో కూర్చుని అర్జీదారుల సమస్యలు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర అంశాలపై అర్జీలు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో బి.విజయభాస్కర్, ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో ప్రతిభ



క్రీడల్లో ప్రతిభ చూపిన సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులకు అభినందన

కశింకోట:హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ ఓపెన్ టూ ఆల్ స్టైల్స్ కుంగ్–ఫూ, కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ స్కూలుకి చెందిన 22 మంది విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు గెలుచుకున్నారు. వారిలో 12 మంది ప్రథమ స్థానం, ఆరుగురు ద్వితీయ స్థానం, నలుగురు తృతీయ స్థానం సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన సీహెచ్ సూరి అప్పారావు, ప్రోత్సహించిన తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ రూపనంది, అకాడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ బృందం సోమవారం స్కూలులో అభినందించారు.

అర్జీలు పునరావృతం కాకుండా
సంతృప్తికర పరిష్కారం

- ప్రజల అర్జీలపై అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాలు
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 283 అర్జీలు

తుమ్మపాల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో సోమవారం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆమె స్వీకరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను సావధానంగా వింటూ, వారి అర్జీలను సంబంధిత అధికారులకు అందించి, తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, నిర్ణీత కాలవ్యవధిలో ఫిర్యాదీలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని సూచించారు. జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకుని సరైన పరిష్కారం చూపాలన్నారు. అలా చేస్తేనే మరోసారి అదే అర్జీతో ఫిర్యాదీదారు కలెక్టర్ కార్యాలయాన్ని ఆశ్రయించే అవకాశం రాదన్నారు.

సోమవారం మొత్తం 283 అర్జీలు నమోదు కాగా, వాటిలో రెవెన్యూ శాఖ(సీసీఎల్ఏ)కు–166, పోలీసు శాఖ–15, సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్–16, పంచాయతీరాజ్ శాఖ–15, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్–4, రూరల్ డెవలప్‌మెంట్–7, ఇతర వివిధ విభాగాలకు చెందినవి 83 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి వై.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామమణి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సీతారామచంద్రస్వామి దేవస్థాన భూముల ఆక్రమణపై ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీతారామచంద్ర ఆలయ భూ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి పట్టణం సర్వే నెం.66లో ఉన్న 29.71 ఎకరాల సీతారామచంద్రస్వామి దేవస్థాన(అంబికా బాగ్) భూములకు రక్షణ కల్పించి, ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడారు. పట్టణంలోని పూల్‌బాగ్ రోడ్డులో రాణిగారి పూలతోట సర్వే నెం.66లో సుమారు రూ.1100 కోట్ల విలువైన దేవాలయ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల ఆక్రమణలో భాగంగా దేవాలయ హెచ్చరిక బోర్డులను, ఫెన్సింగ్‌ను తొలగించడంపై అధికారులు విచారణ చేపట్టి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో 2022 ఏడాదిలో ఆక్రమణకు ప్రయత్నించగా అప్పటి దేవాలయ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అధికార పార్టీ నాయకులే ఆక్రమణకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. ఈ భూ దోపిడీపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతున్నా స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే మాత్రం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దేవాలయ అధికారులు ఫిర్యాదుపై విచారణ జరిపి, తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అల్లు రాజు, మండల కమిటీ సభ్యులు కాళ్ల తేలయ్య, గంటా సుభాషిణి, జిల్లా నాయకులు గండి నాయిన బాబు, డి.డి.వరలక్ష్మి, దళిత బహుజన యూనియన్ కన్వీనర్ కొల్లి సత్యారావు, డి.శ్రీనివాసరావు, కె.ఈశ్వరరావు, పి.చలపతి పాల్గొన్నారు.



రేఖ నూకాలమ్మ, కుమార్తెలు

కబ్జాదారుల నుంచి ఇంటిని అప్పగించాలని మొర

నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకుని పొందిన తమ ఇంటిలో అక్రమంగా చొరబడి ఖాళీ చేయాల్సిందిగా దాడికి దిగుతున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమ ఇంటిని తమకు ఇప్పించాలంటూ రేఖ నూకాలమ్మ కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసింది. మునగపాక మండలం వాడ్రాపల్లి పంచాయతీ గొల్లలపాలెం గ్రామకంఠం సర్వే నెం.104లో క్రయ దస్తావేజులు 4906/2006, 776/2024 ప్రకారం ఆ ఇంటిని తాము పొందామన్నారు. భర్త మరణించడంతో నలుగురు పిల్లలతో జీవించలేక గాజువాక ప్రాంతంలో కూలి పనులకు వెళ్లి అక్కడే తాత్కాలిక నివాసం ఉంటున్నట్లు తెలిపారు. దీంతో తమ ఇంటి తాళాలు పగులగొట్టి అక్రమంగా చొరబడిన వ్యక్తులను, ఖాళీ చేయాల్సిందిగా అడుగుతుంటే తమపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఆ ఇల్లు తప్ప తమకు ఏ ఆధారం లేదంటూ పిల్లలతో పాటు ఆమె కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగింది.

సాగుభూములకు పట్టాలివ్వాలి

కొండ భూమిని సాగు చేసుకుని అదే జీవనాధారంగా బతుకుతున్న తమకు ఆ భూములకు పట్టాలివ్వాలని వి.మాడుగుల మండలం, వల్లాపురం పంచాయతీ, శరబన్నపాలెం దళితులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. నిరుపేదలైన తాము గ్రామంలో కొండభూమిని చదును చేసుకుని కొంతకాలంగా సాగుచేసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయలేదన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో దళితుల సాగు భూములకు పట్టాలు మంజూరు చేశారని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరిగేలా, పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

బాల్యం నుంచే భక్తి భావాలు పెరగాలి



కన్యకాపరమేశ్వరిని దర్శించుకున్న గరికిపాటి

అనకాపల్లి : తల్లిదండ్రులు పిల్లలకు చిన్నప్పటి నుంచి భక్తిభావాలుపెంచాలని, ప్రతి ఒక్కరూ నుదురుపై కుంకుమబొట్టు పెట్టుకోవాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహా సహస్రావధాని గరికిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డు శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్టా శత జయంతి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన అమ్మవారిని దర్శించుకుని, 'శ్రీ మాత్రే నమః' అనే అంశంపై ప్రవచనాలు చేశారు. జీవితం అంతా స్థిరం కాదని, చెట్టు మీద నుంచి పడిన దెబ్బ తట్టుకోలేని వ్యక్తి జీవితంలో దెబ్బలకి ఎలా తట్టుకుంటాడని ఆయన వివరించారు. అనకాపల్లి అంటేనే బెల్లానికి ఎంతో ప్రసిద్ధి చెందిందని, బెల్లంలో తియ్యదనాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించాలని ఆయన కోరారు. విద్యార్థులకు చదువుల భారం ఎక్కువగా ఉండడంతో మత్తు పదార్థాలకు దగ్గరవుతున్నారని అన్నారు. అనంతరం కమిటీ సభ్యులు గరికిపాటి నరసింహారావును శాలువాతో సత్కరించారు.

పశుగణనపై సదస్సు రేపు

విశాఖ సిటీ: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పశుగణనపై ఈ నెల 31వ తేదీ ఉదయం 9.30 గంటలకు గ్రీన్‌పార్క్ హోటల్‌లో సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హాజరుకానున్నారు. అలాగే కేంద్ర ఉన్నతాధికారులతో మూడు రాష్ట్రాల అధికారులు పాల్గొంటారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు బాసటగా భవిత కేంద్రాలు

సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ శకుంతల

కె.కోటపాడు : ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో విజ్ఞానాన్ని పెంచడంతో పాటు దైనందిన జీవితంలో పనులు నిర్వహించే విధానంపై అవగాహనను కల్పించేందుకు భవిత కేంద్రాల ద్వారా కృషి చేస్తున్నట్లు సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ బి.శకుంతల అన్నారు. కె.కోటపాడు హైస్కూల్‌లో గల భవిత కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. ప్రతి రోజూ కేంద్రానికి వచ్చి ఆటపాటలతో కూడిన సహిత విద్యను పొందుతున్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా 173 మంది 6–14 ఏళ్ల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు కె.కోటపాడులో భవిత కేంద్రం ద్వారా సహిత విద్యను పొందుతున్నట్టు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. వీరిలో తీవ్ర, అతితీవ్ర అనారోగ్య సమస్యతో కేంద్రాలకు వచ్చి సహిత విద్యను పొందలేని చిన్నారుల ఇళ్లకు ప్రతి శనివారం సహిత విద్య బోధకులు హోమ్ బేసిడ్ విధానం ద్వారా విద్యను అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సత్యనారాయణ, డి.వి.డి.ప్రసాద్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, సహిత విద్య ఉపాధ్యాయురాలు సీహెచ్.కన్నమ్మ పాల్గొన్నారు.



కె.కోటపాడులో భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శకుంతల

ప్రజల ఆశలు నెరవేర్చండి

- వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలను ఇబ్బంది పెడితే సహించేదిలేదు
- టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన ముగ్గురికి జగన్ భరోసా
- నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం : ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలు సూపర్‌సిక్స్ పథకాల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, వాటిని అమలు చేయాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండలంలో వై.బి.,పట్నం గ్రామంలో సార్వత్రిక ఎన్నికలు కౌంటింగ్ రోజున టీడీపీ కార్యకర్తలు దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చుక్కల రాంబాబుకు వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్యం కోసం రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆ చెక్కును మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ సోమవారం రాంబాబుకు అందజేసి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తల దాడితో మాకవరపాలెం మండలం రాచపల్లి గ్రామానికి చెందిన కోల్లు అప్పలనాయుడు నర్సీపట్నం మున్సిపాలిటీకి చెందిన జగదీష్ తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఈ ముగ్గురికి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున లక్షా యాభై వేలు అందజేసారన్నారు. వై.బి.పట్నంలో రాంబాబుకు కన్నుకు తీవ్ర గాయం కావడంతో కొంత కాలం పాటు ఆసుపత్రిలోనే ఉండిపోయారన్నారు. రాచపల్లికి చెందిన అప్పలనాయుడు 10రోజులకుపైగా కోమాలోనే ఉండిపోయాడని, జగదీష్‌కు కూడా తీవ్ర గాయం అయిందన్నారు. ఈ ముగ్గురి కుటుంబాలను స్వయంగా కలిసి మనోధైర్యం కల్పించాలని జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారన్నారు. అదే విధంగా గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గడ్డివాము పశువులు పాక దగ్ధం చేసారన్నారు. నాతవరం మండలం డి.యర్రవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సబ్బవరపు వెంకునాయుడుతాలూకా మూడు ఎకరాలు జీడి తోట పంట ఫలసాయం లేకుండా చెట్లు నరికేసారన్నారు. రెండోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కాలేదన్న కారణంగా నాతవరం మండలం ములగపూడిలో ఒకరు, నర్సీపట్నం మున్సిపాలిటి పరిధిలో ఒకరు మరణించారన్నారు. ఆయా కుటుంబాలను వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించేందుకు వస్తారన్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఏవిధంగా ప్రజలను నమ్మబలికారో అదే విధంగా పథకాలు అమలు చేసి మీ నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలను కూటమి నేతలు ఇబ్బందులు పెడితే ఉరుకునేదిలేదన్నారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంట జగన్‌మోహన్‌రెడ్డి ఉంటారని అవసరమైతే అందోళన చేసేందుకు వెనుకంజ వేసే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు మున్సిపాలిటీ మాజీ కౌన్సిలరు మాకిరెడ్డి అప్పారావు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్ వై.వి.పట్నం సర్పంచ్ గొర్లి వెంకట సత్యవేణి, మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొర్లె వరహాలబాబు, వ్యవసాయ సలహా కమిటీ మాజీ చైర్మన్ శెట్టి నూకరాజు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు తమరాన సత్యనారాయణ, లోవకృష్ణ, సర్పంచులు బొడ్డు సత్యనారాయణ , మలపురెడ్డి బాబ్జి , మంకు సాంబమూర్తి జివిరెడ్డి సోమ్మన్నదొర, కోసూరి బుజ్జి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

యువతి హత్య కేసులో నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష

- రూ.10 వేల జరిమానా విధింపు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో యువతిని దారుణంగా హత్య చేసి దహనం చేసిన కేసులో నిందితునికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష పడింది. దీంతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ అనకాపల్లి 10వ అదనపు జిల్లా కోర్టు జడ్జి నందనవనం శ్రీవిద్య సోమవారం సంచలన తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించి ఎస్పీ ఎం.దీపిక అందించిన వివరాల ప్రకారం.. పాయకరావుపేటకు చెందిన రెడ్డం నరేష్ కుమార్(35) అదే గ్రామంలో ప్రైవేటు విద్యా సంస్థలో ఏడేళ్ల క్రితం బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. అదే స్కూలులో టీచర్‌గా పనిచేసే పాయకరావుపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సూరపు ఇందిర (21)ను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి కొద్ది రోజుల పాటు సహజీవనం చేశాడు. దీంతో మృతురాలు పెళ్లి చేసుకోవాలని తీవ్ర ఒత్తిడి తేవడంతో ఆమెను అంతమొందించాలని నిందితుడు నిశ్చయించుకున్నాడు. ఈ నేపథ్యంలో 2017 మార్చి 19న ఆమెను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి, కశింకోట మండలం కన్నూరుపాలెం వద్ద లే–అవుట్‌లోకి తీసుకెళ్లి విచక్షణ లేకుండా బ్లేడ్లతో కోసి పెట్రోల్ పోసి తగులబెట్టి అతికిరాతకంగా హత్య చేసి దహనం చేశాడు. దీంతో కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేసి అప్పట్లో రిమాండ్‌కు తరలించారు. కోర్టులో వాద ప్రతివాదనలు పూర్తయిన తర్వాత నేరం రుజువు కావడంతో నిందితుడు నరేష్‌కుమార్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధిస్తూ అనకాపల్లి 10వ అదనపు జిల్లా కోర్టు జడ్జి తీర్పు చెప్పారు. ఈ కేసును అప్పట్లో రూరల్ సీఐ జి. రామచంద్రరావు దర్యాప్తు చేసి కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వడ్డాది వెంకటరావు వాదనలు వినిపించారు. వీరితోపాటు సాక్షులను సకాలంలో హాజరుపర్చి శిక్ష పడటానికి దోహద పడిన కోర్టు మోనటరింగ్ సెల్ సిబ్బందిని, దర్యాప్తు అధికారును, కశింకోట పోలీసులను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

కారు దగ్ధం కేసులో పోలీసుల విచారణ



కాలిపోయిన కారును పరిశీలిస్తున్న పోలీసులు

గొలుగొండ: మండలంలో లింగంపేట గ్రామానికి చెందిన పాసింబిల్లి మంగరాజు కారు దగ్ధం ఘటనపై సోమవారం పోలీసుల విచారణ చేపట్టారు. మంగరాజు తన ఇంటికి కొంచెం దూరంలో ఆదివారం మధ్యాహ్నం బ్రెజ్జా కారు పార్కింగ్ చేశాడు. రాత్రి 11 గంటల సమయంలో కారు ఇంజిన్ భాగం నుంచి పెద్ద మంటలు రావడంతో అతడితోపాటు కుటుంబ సభ్యులు వచ్చి నీళ్లతో ఆర్పారు. అప్పటికే కారు ముందుభాగం 80 శాతం కాలిపోయింది. ఈ ఘటనపై బాధితుడు సోమవారం ఉదయం కృష్ణదేవిపేట పోలీసులకు ఫిర్యాదులు చేశాడు. ఆ మేరకు ఎస్ఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. ప్రమాదం తీరును బట్టి షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

అన్న క్యాంటీన్ మార్చాలని ధర్నా



కొత్తగా ఏర్పాటుచేస్తున్న అన్నక్యాంటీన్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక సభ్యులు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీ పక్కన ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్‌ను వేరే ప్రాంతానికి మార్చాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ మాట్లాడుతూ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీలో భద్రపరుస్తారని, మార్చురీకి అన్నక్యాంటిన్‌కు మధ్య ఒక చిన్నపాటిగోడ మాత్రమే ఉందని తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేసే సమయంలో దుర్వాసన వచ్చే అవకాశం ఉందని, అందువల్ల అక్కడ భోజనం చేసేవారు ఎలా తినగలరని ప్రశ్నించారు. క్యాంటిన్‌ను మరో ప్రాంతానికి మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, ముగడ అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, సాయిబాబు తదతరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేలా కేంద్ర బడ్జెట్

అనకాపల్లి: కేంద్ర బడ్జెట్ బడుగు, బలహీన వర్గాల నోట్లో మట్టి కొట్టి, కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు విమర్శించారు. స్థానిక గవరపాలెం సంతోషిమాత అమ్మవారి ఆలయం వద్ద బడ్జెట్‌కు వ్యతిరేకంగా కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బడ్జెట్ మూడోసారి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. కార్మికుల సంక్షేమానికి కేటాయింపులు లేవని, కొత్తగా ఉపాధి కల్పించడానికి తీసుకొచ్చిన అంశాలు ఆచరణలో లేకుండా కార్పొరేట్ కంపెనీలకు లాభాలు సమకూర్చే బడ్జెట్‌గా ఉందని దుయ్యబట్టారు. రైతు సంక్షేమాన్ని విస్మరించిందని, రాష్ట్ర రాజధాని నిర్మాణానికి నిధులు అప్పుగా ఇస్తామని చెప్పారని, విభజన హామీల అమలులో ఎక్కడా నగదు విదల్చలేదని, పోలవరం ప్రాజెక్టుకు ఎన్ని నిధులు కేటాయిస్తారో చెప్పలేదని తెలిపారు. అంగన్‌వాడీ, విద్య, వైద్యం, ఉపాధి హామీ పథకాలకు కేటాయింపులు పెంచలేదని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.రాము, సంతోష్, వాసు, పోలరావు, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా అన్నీ అబద్ధాలే

- సూపర్ సిక్స్‌పై చేతులెత్తేసిన ప్రభుత్వం
- కూటమి పాలనలో అరాచకం
- ప్రత్యర్థులను హత్యచేయడమే వారి లక్ష్యం
- మాజీ ఎమ్మెల్యే కంబాలజోగులు



నక్కపల్లి: అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు అబద్ధాలు చెబుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట ఇన్‌చార్జ్ కంబాల జోగులు ఆరోపించారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఎన్నికల ముందు గెలవడం కోసం అమలు సాధ్యం కాని పథకాలను ప్రకటిస్తూ సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులెత్తేశారని ఎద్దేవ చేశారు. మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని ఆరోపించారు. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా,వైఎస్సార్ చేయూత, మత్స్యకార భరోసా, నేతన్న నేస్తం వంటి పథకాలను తొలి ఏడాది నుంచే అమలు చేసినట్టు చెప్పారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే పథకాల నగదు జమచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. 2019లో వైస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఖజానాలో రూ.100 కోట్లు మాత్రమే మిగిల్చారన్నారు. కానీ జగనన్న ప్రభుత్వం మాత్రం ఏడు వేల కోట్లకు పైగా నిధులను ఖజానాలో నిల్వ ఉంచిందని చెప్పారు. ఖజానా ఖాళీగా ఉన్నా, కరోనా సంక్షోభ సమయంలోకూడా తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిందన్నారు. చంద్రబాబు ప్రతి మంగళవారం వేలకోట్లు అప్పులు తెస్తున్నారని, ఇప్పటి వరకు పదిహేను వేల కోట్ల అప్పులు చేశారన్నారు. ఇచ్చిన హామీల్లో ఒక్క పింఛన్లు తప్ప ఏ ఒక్కపథకం అమలు చేయలేదని, కనీసం ఎప్పటినుంచి అమలు చేస్తారోకూడా ప్రకటించడం లేదన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని చెప్పి ఇచ్చిన హామీలను ఎగ్గొట్టేప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు, ప్రత్యర్థిని అంతమొందించడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. ఇలా అయితే అధికారం కోల్పోయిన తర్వాత టీడీపీ నాయకులు ఇదే ఇబ్బంది ఎదుర్కో తప్పదన్నారు.అధికారం శాశ్వతం కాదని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే అనకాపల్లి జిల్లాలో పలువురు మహిళలు, బాలికలపై అత్యాచారాలు, దాడులు జరిగాయని తెలిపారు. ఇటువంటి పరిస్థితి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేదని జోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

జూలో తెల్ల పులి దత్తత



తెల్ల పులి దత్తత కోసం జూ అధికారులకు చెక్కు అందజేస్తున్న ఏఎంఎన్ఎస్ లిమిటెడ్ ప్రతినిధులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఒకటో తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు పులులు, వాటి సంరక్షణ, పర్యావరణంలో పులులు ప్రాధాన్యతపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్సిలోర్ మెటల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్(ఏఎన్ఎంఎస్) ప్రతినిధులు జూలో బాలు అనే మగ తెల్ల పులిని ఏడాదిపాటు దత్తత తీసుకొన్నారు. దీని కోసం రూ 1.90 లక్షల చెక్కును జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియాకు ఏఎంఎన్ఎస్ వైజాగ్ హెచ్ఆర్ హెడ్ అండ్ అడ్మిన్ డి.ఎస్ వర్మ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలో తెల్ల పులిని దత్తత తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీంతో పాటు కేజీహెచ్, విక్టోరియా ఆస్పత్రులు, పాఠశాలలకు సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్యూరేటర్ మాట్లాడుతూ ఏఎంఎన్ఎస్ లిమిటెడ్ అందించిన సాయంతో తెల్ల పులి బాలుకు ఏడాది పాటు ఆహారం అందించే అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఏఎంఎన్ఎస్ ప్రతినిధులు, జూ అడిషనల్ క్యూరేటర్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలరావు, ఎఫ్ఎస్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరి విత్తనాలు ఉచితంగా అందించాలి


సూరిశెట్టి రమణఅప్పారావు

అనకాపల్లి: రైతులు ఖరీఫ్ సాగులో వేసిన వరి విత్తనాలు మొలకెత్తే సమయంలో అధిక వర్షం కారణంగా నారుమడులు పూర్తిగా మునిగి, పనికిరాకుండా పోయాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పులికాలువ సంఘం సభ్యుడు సూరిశెట్టి రమణఅప్పారావు సోమవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి సౌత్ 1, 2, అనకాపల్లి, కశింకోట మండలాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సబ్సిడీపై విత్తనాలు సకాలంలో ఇచ్చారని, కాలం కలసిరాక రైతులు నష్టపోయారని వెల్లడించారు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి రైతుల్ని ప్రభుత్వం ఆదుకుని, ఉచితంగా వరివిత్తనాలు అందించాలని కోరారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో అందించాల్సిన రైతు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తే, నష్టపోయిన రైతులకు ఆసరాగా ఉంటుందన్నారు.

భారీగా పెరిగిన బంగాళాదుంపల ధర

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం బంగాళాదుంప ధర భారీగా పెరిగింది. గతంలో ఎన్నడూ లేని ధరకు విక్రయాలు సాగాయి. కిలో రూ.70కి విక్రయించారు. గత వారం రూ.50 ఉండగా, ఈ వారం ఒక్కసారిగా రూ.20 పెరిగింది. వంకాయ ధర కూడా బెట్టు మీదే ఉంది. రూ.80కి విక్రయించారు. ఇక ఉల్లిపాయ, దొండకాయ రూ.40, బరబాటి, బీట్రూట్, క్యారెట్, బీరకాయ, బెండకాయ, చేమదుంప రూ.60, గోరు చిక్కుడు, కాకరకాయ రూ.80, క్యాప్సికం, పాదు చిక్కుడు రూ.100కు విక్రయాలు సాగాయి. పొట్ల కాయ ఒకటి రూ.25 చొప్పున విక్రయించారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ జరగాలి

మునగపాక : ఆగస్టు నెలకు సంబంధించిన పింఛన్ల పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల లోగా పింఛను పంపిణీ శతశాతం పూర్తవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయం చేసుకుంటూ పింఛను పంపిణీ ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 17 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	----	----
రెండో రకం	----	----
మూడోరకం	3,450	3,450

అనకాపల్లి సినిమాలు

డెడ్‌పూల్ వుల్వరీన్	: రాజా
కల్కి 2898ఏడీ	: సత్యనారాయణ స్క్రీన్-1
డెడ్‌పూల్ వుల్వరీన్ 3డీ తెలుగు	: సత్యనారాయణ స్క్రీన్-2
రాయన్	: పర్తిసాయి
డార్లింగ్	: షిర్డిసాయి
పురుషోత్తముడు	: వెంకటేశ్వర
రామ్ ఎన్ఆర్ఐ	: శ్రీసత్య
ఆపరేషన్ రావణ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నారు మునిగి.. గుబులు పెరిగి

- 292 ఎకరాల్లో నారు మడులు భద్రం
- నీటితో 5,600 ఎకరాల్లో నాట్లకు సిద్ధం
- 250 ఎకరాల్లో ఎద పద్ధతిలో వరి సాగు
- కొత్త నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు
- అందుబాటులో 30 క్వింటాళ్ల వరి విత్తనాలు

అనకాపల్లి మండలంలో ఖరీఫ్ వరి సాగు చేస్తున్న రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. తాజాగా కురిసిన భారీ వర్షాలకు చాలా చోట్ల నారుమడులు నీట మునిగాయి. ఇప్పటికీ కొన్ని చోట్ల నీటి ముంపు నుంచి పొలాలు తేరుకోలేదు. ఓ వైపు నారు కుళ్లిపోతుందన్న దిగులు, మరోవైపు నారు ముదిరిపోయి దిగుబడి తగ్గిపోతుందన్న భయం రైతుల్ని పీడిస్తున్నాయి. నాట్లకు అనుకూలంగా ఉన్న చోట్ల దమ్ములకు సిద్ధమవుతున్నారు.


సీహెచ్ఎన్ అగ్రహారంలో నీట మునిగిన నారుమడిని పరిశీలిస్తున్న అధికారులు

అనకాపల్లి: మండలంలో ఖరీఫ్ వరి నాట్లకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది మండలంలో 292 ఎకరాల్లో నారు మడులు భద్రంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆరంభంలో చాలా చోట్ల నారుమడులు మునిగిపోయాయి. తెరిపిచ్చాక కాల్వల్లో పూడిక తొలగింపుతో నీటి ముంపు తప్పింది. అయినా కొన్ని చోట్ల నారుకు నష్టం వాటిల్లింది. దీంతో ఆయా రైతులు కొత్తగా నారు మడులు వేస్తున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నారుమడులతో 5,600 ఎకరాల్లో నాట్లు వేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. నాట్లు పూర్తయ్యే వరకు నారుమడుల్ని సంరక్షించుకోవాలని సూచిస్తున్నారు.

దమ్ము చేసుకోవాలి

మండలంలోని రేబాక, తుమ్మపాల, శంకరం, వెంకుపాలెం గ్రామాల్లో 250 ఎకరాల్లో ఎద పద్ధతిలో వరి సాగు జరుగుతోంది. నారు మడులకు నష్టం వాటిల్లిన చోట కొత్తగా నారుమడులు సిద్ధం చేస్తున్నారు. మిగిలిన పొలాల్లో చాలా వరకు నాట్లు వేసేందుకు అవసరమైన నారు అందుబాటులో ఉంది. దీంతో ముందగానే పొలాల్ని దమ్ముపట్టి సిద్ధం చేసుకోవాలని అధికారులు చెప్తున్నారు. నాట్లు వేసే ముందు కనీసం మూడు సార్లు దమ్ము చేసుకుంటే మేలంటున్నారు.

నాట్లు వేయడంలో మెళకువలు

- నాట్లు వేయడానికి నారుమడి నుంచి నారును తీసేటప్పుడు లేతాకుపచ్చగా ఉంటేనే మొన త్వరగా తిరగబడుతుంది.
- నాటేందుకు 4-6 ఆకులు ఉన్న నారును మాత్రమే ఉపయోగించాలి. ముదురు ఆకులున్న నారు నాటితే దిగుబడి తగ్గిపోతుంది.
- పొలంలో నారును పైపైన 2-3 సెం.మీ. లోతున నాటితే పిలకలు ఎక్కువగా తొడిగే అవకాశం ఉంటుంది.
- భూసారాన్ని అనుసరించి ఖరీఫ్‌లో చదరపు మీటరు పొలంలో 33 మొనలు ఉండేలా నాట్లు వేసుకోవాలి.
- నాట్ల మధ్య ప్రతి రెండు మీటర్లు ఎడమలో 20 సెం.మీ. కాలి బాటలు విడిచిపెట్టాలి.
- బాటలు తీయడంతో పైరుకుగాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి కొంతమేర అదుపులో ఉంటుంది.
- ఎరువులు, పురుగు మందుల పిచికారీ, కలుపు మందులు వేయడానికి బాటలు బాగా ఉపయోగపడతాయి.

నారు సంరక్షణ చర్యలు

- వరి నారు వేయాలనుకునే రైతులు నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ముచేసి, పొలాన్ని చదును చేసుకోవాలి.
- నారుమడిలో నీరు పెట్టడానికి, తీయడానికి అనువుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.
- మొలక కట్టిన వరి విత్తనాన్ని సెంటు పొలంలో 5 కిలోల చొప్పున చల్లాలి.
- నారు ఒక ఆకు పూర్తిగా విచ్చుకునే వరకు ఆరు తడులు, ఇచ్చి తర్వాత నీరు పలుచగా నిలవకట్టాలి.
- విత్తనం చల్లిన 10 రోజులకు, 17 రోజులకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. ముందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- నాట్లు వేసేందుకు వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు తక్కువ నీరు ఉండేలా చేసి, జల్లుకోవాలి.


సీతానగరంలో సిద్ధంగా ఉన్న వరి నారుమడి

కొన్ని చోట్లే నారుకు నష్టం



ప్రస్తుతం ఉన్ననారు పొలాల్లో నాట్లు వేసుకునేందుకు సరిపోతుంది. నారు ముదురకుండా రైతులు నాట్లు వేసుకోవాలి. పొలంలో నీరు పోయేందుకు, కలుపు తీసుకునేందుకు వీలుగా బాటలు ఏర్పాటు చేసుకోవాలి. కొన్ని చోట్ల, అది కూడా కొద్దిగా మాత్రమే నారుకు నష్టం వాటిల్లింది. ఆ రైతులు నారు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాంటి వారి కోసం 30 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. నాట్లు వేశాక వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండాలి. చిన్నపాటి తెగుళ్లు సోకినా అశ్రద్ధ చేయకుండా సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.

– పీయూటీపీ రంగాచారి, మండల వ్యవసాయ అధికారి, అనకాపల్లి

ఘనంగా ముగిసిన శిక్షా సప్తాహ్


పీఎం పోషణ్-శుభ తిథి భోజన్ కార్యక్రమంలో విద్యార్థులకు వడ్డిస్తున్న అతిథులు

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో శిక్షా సప్తాహ్ ముగింపు సందర్భంగా సోమవారం 'పీఎం పోషణ్–శుభ తిథి భోజన్'కార్యక్రమాన్ని హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు ప్రారంభించారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఆర్ఈసీఎస్ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, రిటైర్డ్ టీచర్ ఆళ్ల ఓంరాం, వస్త్ర వ్యాపారి కాండ్రేగుల సతీష్‌లు కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అదనంగా స్వీట్లు, పండ్లు వగైరా సమకూర్చారు. స్థానిక పెద్దలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

1న చీరలు, కొబ్బరి చెక్కల హక్కు వేలం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దేవదాయశాఖ ఆధ్వర్యంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో భక్తులు అమ్మవారికి నివేదించిన చీరలు, రవికెలు, కొబ్బరి చెక్కలను ఏడాదిపాటు పొందేందుకు టెండర్, బహిరంగ వేలంను వచ్చే నెల 1న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజసులోచన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. లైసెన్సు హక్కు చీరలు, రవికెలకు 2024 ఆగస్టు 1 నుంచి 2025 జూలై 31 వరకు, కొబ్బరి చెక్కల సేకరణకు ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు ఉంటుందన్నారు. పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.5 వేలు చొప్పున ప్రథమ ధరావతు చెల్లించాలన్నారు.

ఆలయ ప్రాంగణంలో తుప్పల తొలగింపు


కోదండ సీతారామచంద్రమూర్తి ఆలయ ప్రాంగణంలో తుప్పలు తొలగిస్తున్న దృశ్యం


తొలగించడానికి ముందు పిచ్చి మొక్కలతో నిండిన ఆలయ ప్రాంగణం

కశింకోట: స్థానిక జాతీయ రహదారి పక్కన వెలసిన దేవదాయ శాఖకు చెందిన కోదండ సీతారామచంద్రమూర్తి దేవాలయాన్ని శుభ్రపరిచే కార్యక్రమాన్ని రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. యువ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ రేజేటి మారుతి సొంత ఖర్చుతో ఆలయం చుట్టూ దట్టంగా పెరిగిన తుప్పలు, పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్నారు. జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో ఆది, సోమవారాలు ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. దీంతో భక్తులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తూ, మారుతిని అభినందించారు.

పరిశ్రమల్లో భద్రతపై దృష్టి పెట్టాలి

పరవాడ: ఫార్మాసిటీలోని పరిశ్రమల్లో ఇటీవల జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. స్మైలెక్స్‌తో పాటు మిగిలిన పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పూర్తిగా గాలికి వదిలేశారని ఆరోపించారు. స్మైలెక్స్ పరిశ్రమలో జరిగిన వరుస ప్రమాదాల్లో పెదగంట్యాడ, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన పలువురు కార్మికులు మృత్యువాత పడ్డారన్నారు. పరిశ్రమలో కార్మిక చట్టాలు అమలు చేయలేదం లేదని ఆరోపించారు. పీఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతన చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. పరిశ్రమల్లో భద్రతపై ఆడిట్ నిర్వహించి ప్రమాదానికి కారకులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

కోరుకొండ కాశీకి ఘన నివాళులు


కాశీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు, పార్టీ శ్రేణులు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వ్యాపారవేత్త, సంఘసేవకుడు కోరుకొండ కాశీ పెద్దకర్మ సందర్భంగా సోమవారం స్థానిక కోట్నివీధిలోని స్వగృహంలో ఆయన చిత్రపటానికి మాజీ ఎంపీ బీవీ సత్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాశీ కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, నాయకులు మలసాల రమణారావు, కలగా గున్నయ్యనాయుడు, పలకా రాము, పలకా సత్యనారాయణ, జాజుల రమేష్, దాడి కుమార్, పెద్దాడ రామశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రైతులు, కార్మికులకు తీరని అన్యాయం


బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న రైతు సంఘ ప్రతినిధులు

మునగపాక : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు తీరని అన్యాయం జరగడాన్ని నిరసిస్తూ సోమవారం మునగపాకలో సీఐటీయూ ఆధ్వర్యంలో రైతు సంఘాల నేతలు ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు శ్రీనివాసరావు, మహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మొండి చేయి చూపించారన్నారు.అలాగే గ్రామీణ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. రైతులకు సంబంధించిన కనీస మద్దతు ధరలు ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. దీంతో భవిష్యత్‌లో వ్యవసాయ రంగం కుదేలవుతుందన్నారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా జరగనున్న ఆందోళనకు ప్రజలు మద్దతు అందించాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మాజీ, రాము,రమణ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


యోగా పోటీల్లో సత్తాచాటిన తానాం గురుకుల పాఠశాల విద్యార్థులతో హెచ్ఎం అప్పలనాయుడు


యోగా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం కనకేశ్వరరావు

పరవాడ: యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖ జిల్లా సీతమ్మధార కృష్ణమందిర్‌లో ఈ నెల 28న జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తానాం గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.

- 10–12 సంవత్సరాల విభాగంలో జి.తేజశ్విని వెండిపతకం, తేజశ్రీ కాంస్య పతకాలు సాధించారు.
- 12–14 విభాగంలో డి.హర్షిత బంగారు పతకం, బి.వైష్ణవి వెండి పతకం, ఎస్.కౌశిక కాంస్య పతకాలు, 14–16 విభాగంలో కె.హరిత బంగారు పతకం, కె.భావన వెండి పతకం, కె.వెంకట వైష్ణవి కాంస్య పతకాలు సాధించారు.
- పతకాలు సాధించిన విద్యార్థులు సెప్టెంబరులో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారు. ఈ మేరకు ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు, యోగా శిక్షకుడు సీహెచ్.ఆంజనేయులు అభినందించారు.

వాడ చీపురుపల్లిలో..

యోగా పోటీల్లో 14–16 ఏళ్ల విభాగంలో వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఎస్.అభిరామ్ కాంస్య పతకం సాధించాడు. ఈ మేరకు అభిరామ్‌ను పాఠశాల హెచ్ఎం పందిరి కనకేశ్వరరావు, పీడీ బి.అన్నాజీరావు, కోచ్ ఆంజనేయులు సోమవారం పాఠశాలలో అభినందించారు.

అజ్మీర్ షరీఫ్‌లో చాదర్ సమర్పణ


చాదర్ సమర్పిస్తున్న చాంద్‌బాషా

కోటవురట్ల: రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్‌లో ఉన్న ఖ్వాజా మొహినుద్దీన్ చిస్టి రెహమాతుల్లా అలై వారి దర్గాను స్థానిక ముస్లిం కాలనీకి చెందిన చాంద్ బాషా కుటుంబసభ్యులు సోమవారం సందర్శించారు. చాంద్ బాషా మాట్లాడుతూ ముస్లింలకు అతి పవిత్రమైన ఖ్వాజా మొయినుద్దీన్ చిస్టీ రెహమాతుల్లా అలై వారి దర్గాలో ముస్లిం కాలనీ మజీద్ ఉస్మాన్ ఘని, నవజవాన్ యూత్ తరపున చాదర్(పవిత్ర వస్త్రం) సమర్పించి, పుష్పాలు, మిఠాయిలను అందజేసినట్టు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అల్లాహ్‌కు దువ చేసినట్టు తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి


మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

మునగపాక:పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ మునగపాక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకం కూలీలు సోమవారం ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వారాల తరబడి ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్ వేతనాలు సకాలంలో అందించి ఆదుకోవాలన్నారు. అనంతరం మండల పరిషత్ ఏవో ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ, సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు,టిక్కలి జగ్గారావు, సూరిబాబు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కర్మయోగం విశిష్టతను తెలుసుకోవాలి


త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రదర్శిస్తున్న కమిటీ సభ్యులు

కోటవురట్ల: కర్మయోగం విశిష్టత గురించి తెలియజేసేదే త్రైత సిద్ధాంత భగవద్గీత అని హిందూ ధర్మ ప్రచార ప్రబోధసేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ ఉపాధ్యక్షుడు శాంతరాజు తెలిపారు. ప్రతీ మానవుడు తాను చేసిన కర్మ ప్రతిఫలాన్ని తప్పక అనుభవిస్తాడని త్రైత సిద్ధాంత భగవద్గీత చెబుతోందన్నారు. జీవాత్మ, పరమాత్మ, ఆత్మల పరమార్థాన్ని శాస్త్రీయంగా తెలుసుకోవడానికి భగవంతుడు అందించిన ఏకైక జ్ఞాన మార్గం భగవద్గీత అన్నారు. ఆదిమధ్యాంత రహితుడైన పరమాత్మ భూమిపై జన్మిస్తే ఆయనను గురువు అంటామన్నారు. దేవుడే మనిషిగా జన్మిస్తే ఆయనను మాత్రమే గురువుగా గుర్తించాలన్నారు. సాక్షాత్తు శ్రీకృష్ణుడిని మాత్రమే జగద్గురువుగా భావించి గురుపూజ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు స్వామినాయుడు, నాగేశ్వరరావు, సత్యవతి, వ్యాస్, జలందర్ పాల్గొన్నారు.

'మహిళా కార్మికులకు కంపెనీ వేధింపులు'

అచ్యుతాపురం : మండలంలోని ఒక దుస్తుల కర్మాగార అనుబంధ కంపెనీలో ఒక ఉద్యోగిని వేధింపులకు గురై మృతి చెందారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము ఆరోపించారు. కంపెనీలో పనిచేసే మహిళా ఉద్యోగులకు వేధింపులు ఎక్కువ అయ్యాయని, జీతం పెంచమని అడిగితే మహిళా ఉద్యోగుల్ని తొలగిస్తున్నారని అన్నారు. రాత్రి వేళల్లో మహిళా ఉద్యోగుల చేత పని చేయించకూడదనే నిబంధనలు ఉన్నా ఆ కంపెనీ నిబంధనలను అమలు చేయడం లేదన్నారు.ఈ కార్యక్రమంలో సోమునాయుడు,కాశీ,నాయుడు,అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల్లేక అలమటిస్తున్నాం..


చెత్తను తరలిస్తున్న పారిశుధ్య వర్కర్లు

కోటవురట్ల : పల్లెల్లో పారిశుధ్యం మెరుగుకు కృషి చేస్తున్న కార్మికుల కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయి. కొద్ది నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తిండికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. మండలంలో సుమారు 60 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. తెల్లారి లేస్తే వీధుల్లో రిక్షా తొక్కుతూ చెత్తను సేకరించి ఆరోగ్యకర వాతావరణానికి కృషి చేస్తారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

సాగునీటి కాల్వలు కప్పేశారు...


రీ సర్వే డీటీ పడాల్‌కు వినతి అందజేస్తున్న రైతులు

మునగపాక : సాగునీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ డిమాండ్ చేశారు. మునగపాక మెయిన్‌రోడ్డు దరిలే-అవుట్‌ల కారణంగా సాగునీటి కాలువలు కప్పేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఇందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ సాగునీటి కాలువలను పైపులతో కప్పేయడంతో సాగునీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదన్నారు. దీంతో ఎగువ ప్రాంతాల్లో పంటలు ముంపునకు గురవుతున్నాయన్నారు. అనంతరం రీ-సర్వే డీటీ పడాల్, ఆర్ఐ కిషోర్‌కుమార్‌లకు వినతి పత్రం అందజేశారు. కాగా రైతులకు అసౌకర్యం కలిగించేలా ఉన్న ఇరిగేషన్ ఏఈ చర్యల పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.